# విద్యార్థుల చదువు, వారి సంక్షేమం

# Students' Education and their Welfare

## రచయిత

బి. నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు

PMSHRI ZPHS డోర్నకల్

మహబూబాబాద్ జిల్లా

## ఎడిటింగ్

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్

స్కూల్ లీడర్ షిప్ అకాడమీ

యస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ

## సలహాదారు

జి. రమేష్

సంచాలకులు

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, తెలంగాణ, హైదరాబాద్

**2024-25**

స్కూల్ లీడర్ షిప్ అకాడమి

ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్

నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్ షిప్,

ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL – NIEPA), న్యూఢిల్లీ

## విషయం:

## 1.0 చదువు

1.1 ప్రజల దృష్టిలో ప్రభుత్వ / ప్రైవేటు పాఠశాలలు – ఉపాధ్యాయుల పట్ల వారి అభిప్రాయాలు

1.2 ప్రణాళికా – కార్యాచరణ

1.3 మన పాఠశాలలో చదువు

## 2.0 సంక్షేమం

2.1 మనం ఏం చేయాలి

2.2 మన స్వతంరత కృషి

## ముగింపు

## లక్ష్యాలు (Objectives):

1. ప్రతీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు / ప్రిన్సిపాల్ తమ పాఠశాలను ఎలా అధ్యయనం చేయాలో తెలుసుకొనుటకు దోహదపడుతుంది.

2. ఇప్పటికంటే మరింత బాగా పాఠశాలను నిర్వహించగలనని నమ్మకం ఏర్పడుతుంది.

3. ప్రతీ విద్యార్థి కుటుంబంతో పాఠశాల మమేకమవుటకు దోహదపడుతుంది.

4. పాఠశాల తన విద్యార్థికి భవిష్యత్తు పట్ల భరోసాను ఇస్తుంది.

5. సమాజం ఆ పాఠశాలకు తగిన గుర్తింపు, గౌరవాన్ని పెంపొందించుటకు దోహదపడుతుంది.

# "విద్యార్థుల చదువు, వారి సంక్షేమం"

# (Students' Education and their Welfare)

## పరిచయం:

### ప్రధానోపాధ్యాయులారా,

మనం ఒక ప్రభుత్వ పాఠశాలకు నాయకునిగా పని చేస్తుండటం గర్వకారణం. ప్రకృతిలో ప్రతీ ప్రాణి గుర్తింపును పొందుతుంది. మనం గుర్తింపును, గౌరవాన్ని కూడా కోరుకుంటాము. ప్రస్తుతం మనం పనిచేస్తున్న పాఠశాలలో మనకు ముందు ఎంతో మంది ప్రధానోపాధ్యాయులు / ప్రిన్సిపాల్స్ పనిచేసి ఉన్నారు. వారిలో కొందరినే ఆయా గ్రామాలు/పట్టణాల ప్రజలు, పూర్వ విద్యార్థులు పదే పదే తలచుకుంటూ వుంటారు. కొన్ని సందర్భాల్లో ఆ వ్యక్తి జీవించి ఉండకపోవచ్చు గాక లేదా రిటైర్ అయి వేరే చోట నివసిస్తూ ఉండవచ్చు. తమ కళ్ళెదుట వారు లేకున్నా ఆమె/ఆతని పట్ల కృతజ్ఞతా భావంతో ఉండటం, జ్ఞాపకాలు గుర్తు చేసుకోవడం మనకు ప్రతీ చోటా అనుభవంలోకి వస్తుంది. వారిని ప్రజలు అంతలా గుర్తు చేసుకుంటూ ఆరాధించడానికి కారణాలను మీరెప్పుడైనా ఆలోచించారా! ఆసక్తి ప్రదర్శిస్తూ సంబంధితులతో చర్చించారా! ఈ పని మీలో కొందరైనా ఇప్పటికే చేసి ఉంటారు. నాటి పరిస్థితులు వారు చేసిన కృషికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, విశ్లేషించుకుంటే "**విద్యార్థుల చదువు, వారి సంక్షేమం**" పట్ల వారు ఎంతో శ్రద్ధ తీసుకున్నారని, మార్పును సాధించారని అర్థమవుతుంది. మహనీయులు జ్యోతిరావు పూలే, సావిత్రీ భాయి పూలే, గురజాడ అప్పారావు పంతులు, గిడుగు రామమూర్తి పంతులు, గిజుభాయి భగేక వంటి ఎందరో త్యాగధనులు ప్రజల జీవనవిధానంతో మమేకమై సమాజ మార్పుకు గొప్ప కృషి చేసి సానుకూల ఫలితాలు సాధించారని, సంఘ సంస్కర్తలుగా ఆవిర్భవించారని మనకు అర్థమవుతుంది. అటువంటి స్ఫూర్తి ప్రదాతలను మనం నిరంతరం మనస్సులో ఉంచుకోవాలి.

**"మనం ఎంతకాలం ఈ పాఠశాలలో పని చేశాం, ఎంత కాలం జీవించాం" అన్నది ముఖ్యం కాదు. ఒక పాఠశాల నాయకుడిగా కదిలి, సహోపాధ్యాయులను కదిలించి గొప్ప మార్పుకు నాంది పలుకుదాం.** "నేను సైతం ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచి పోవాలి" అందుకు గాను ఏం చేయాలి? ఎలా చేయాలి? అన్నది చర్చిద్దాం.

## 1.0 చదువు (STUDY)

### 1.1 ప్రజల దృష్టిలో ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలు - ఉపాధ్యాయుల పట్ల వారి అభిప్రాయం.

ప్రభుత్వ పాఠశాలల పట్ల అత్యధిక ప్రజల్లో సానుకూలత లేదు. సూటిగా చెప్పాలంటే విశ్వాసం లేదు. ప్రైవేట్ పాఠశాలల పట్ల వారి అభిప్రాయం భిన్నంగా ఉంది. **2024-25** విద్యా సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్యలో ఉన్న మొత్తం విద్యార్థులు **58.18** లక్షలు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు **23.26** లక్షలు **(40%).** ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారు **34.92** లక్షలు **(60%).** ప్రైవేటు పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ. ఇప్పటికీ **40%** మంది మన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారంటే **2** కారణాలున్నాయి.

అ) తల్లిదండ్రులకు ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్థోమత లేకపోవడం.

ఆ) మన పాఠశాలల పట్ల కొందరిలోనైనా నమ్మకం ఉండటం.

మన రాష్ట్ర పరిస్థితికి భిన్నంగా కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లోని ప్రభుత్వపాఠశాలల్లో **80-85%** మంది విద్యార్థులు చదువుతున్నారు. జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల్లో చురుకుగా పనిచేస్తున్న **75** మంది **15** బృందాలుగా కేరళ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ మరియు ఎయిడెడ్ యాజమాన్యాలలోని ప్రాథమిక, సెకండరీ, హయ్యర్ సెకండరీ పాఠశాలలను సందర్శించాము. చాలా అద్భుతంగా ఆ పాఠశాలలు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థులు చాలా ఆనందంగా, ఉత్సాహంతో చదువు నేర్చుకుంటున్నారు. అక్కడ పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మేము చర్చలు జరిపాము. ఆసక్తికరమైన ఎన్నో విషయాలు తెలిశాయి. కేరళ ప్రభుత్వం ఇప్పటికే **95**శాతం పైగా అక్షరాస్యత సాధించినా విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నది. అందంగా, ఆకర్షణీయంగా అన్ని వసతులతో పాఠశాలల భవనాలు నిర్మించడం, నిర్వహణ బాగుంది. రిటైర్మెంట్ వలన ఖాళీ అవుతున్న ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నారు. ఎల్.కె.జి నుండి ప్రతీ తరగతిలో ఒక టీచర్ ఉండటం, ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయడం వలన విద్యార్థులు నాణ్యమైన చదువులు పొందుతున్నారు. **45000**కు పైగా తరగతి గదులు డిజిటలైజేషన్ చేయబడినాయి.

ఆటలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

విద్యతో పాటు వైద్యం ఉచితంగా అన్ని స్థాయిల్లో అందుబాటులో ఉండటం ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఉండడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరడానికి ప్రధాన కారణం. పాఠశాలలో తల్లితండ్రుల కమిటీలు చురుగ్గా పనిచేయడంతో ఇది సాధ్యమైంది. మన రాష్ట్రంలో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. మనం విద్యావిధానాల్లో సానుకూల మార్పు కోసం ప్రయత్నిస్తూనే మన పనివిధానంలో గుణాత్మక మార్పుకు నాంది పలకాలి.

### తల్లిదండ్రులు ఏం చేస్తున్నారు? ఏం కోరుకుంటున్నారు?

మన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం ప్రధాన ఆర్థిక కార్యకలాపంగా ఉంది. **55.49%** మంది ప్రజలు వ్యవసాయం మరియు దాని అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడి జీవిస్తున్నారు. స్వయం ఉపాధి కలిగినవారు గణనీయంగా ఉన్నారు. నిత్యం గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. స్థిరమైన ఆదాయం లేదు. **84%** ప్రజలు ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ కులాలకు చెందిన వారున్నారు (**2024**వ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే). ఆర్థికంగాను, సామాజికంగానూ ఎంతో వెనుకబాటుతనం ఉంది. అదే సమయంలో దేశంలో విద్య ప్రైవేటు రంగంలో మన రాష్ట్రం ముందు వరుసలో ఉంది. ఇదొక వైరుధ్యం.

### ప్రైవేట్ పాఠశాలల పట్ల భ్రమలు - ప్రచారార్భాటాలు

ఎల్.కె.జి. నుండే ఐ.ఐ.టి. ఫౌండేషన్ గురించి ప్రైవేట్ పాఠశాలలు తీపి కబుర్లు చెబుతూ ఆశలు కల్పిస్తుంటాయి. డిగ్రీ, ఎల్.కె.జి. కంటే పెద్ద చదువు. కానీ ఫీజు మాత్రం ఎల్.కె.జి. చదువుకే ఎక్కువగా ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం ఈ వలయంలో చిక్కు కుంటున్నారు. భ్రమలకు లోనవుతూ మెరుగైన జీవితాల పేరిట ప్రైవేట్ పాఠశాలల్లో తమ బిడ్డలను చేర్పిస్తున్నారు. ఎవరైనా "మీ పిల్లలను మీరు పని చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు చదివించడం లేదు" అని ప్రశ్నిస్తే వారు తమను తాము ఆత్మరక్షణ చేసుకుంటూ మాట్లాడే మాటలు, పద్ధతి ఏ మాత్రం తల్లిదండ్రులను సంతృప్తి పరచడం లేదు. తమ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజలు తమ బిడ్డలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. తమ

పిల్లలను ప్రతీ రోజూ పాఠశాలకు సక్రమంగా తీసుకెళ్లడం, తాము ఇళ్లకు తిరిగి వచ్చేంత వరకు పాఠశాలలోనే ఉంచడం, వారిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడం, తమ పిల్లల గురించి తమతో నిరంతరం సంప్రదించే వ్యవస్థ/ యంత్రాంగంను వారు కోరుకుంటున్నారు. అది ప్రైవేటా! పబ్లికా! అనేది వారికి అనవసరం.

ఆర్థిక సంబంధాల రీత్యా ఆచరణలో తల్లిదండ్రులతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యమే నిరంతరం సంప్రదింపులు జరపడం, వ్యక్తిగతంగా కలవడం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల వైపు ఇటువంటి ప్రయత్నం లేకపోవడంతో పేదలు కూడా ప్రైవేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. తల తాకట్టు పెట్టైనా ప్రైవేట్ పాఠశాలలలో తమ బిడ్డలను చేర్పించడానికి సిద్ధమవుతున్నారు. నాణ్యమైన చదువులు అక్కడ వస్తాయనే విశ్వాసం, ఆశ ఉంది. డబ్బు ఖర్చు పెడుతున్నారు కనుక చదువులో నాణ్యతను కోరడం సహజం. ప్రైవేట్ స్కూళ్ళలో వేసే మార్కులు, ఇళ్లకు పంపిస్తున్న రిపోర్టులు, విద్యార్థుల క్రమశిక్షణ తల్లిదండ్రులలో నమ్మకం పెంచుతున్నాయి. ప్రైవేట్ యాజమాన్యాలు తమ ఉపాధ్యాయుల పట్ల కఠినంగా (కొన్ని సందర్భాల్లో అమానుషంగా) వ్యవహరిస్తూ నిరంతరం అజమాయిషీ చేస్తూ పని చేయిస్తుంటాయి. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం, విద్యార్థులకు హోం వర్క్ ఇవ్వడం, కరెక్షన్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ తెలపడం జరుగుతుంది. విద్యార్థి ఆసక్తిని బట్టి ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తర్ఫీదు నిస్తారు. అంతిమంగా ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులు పట్ల స్పెషల్ కేరింగ్ తీసుకుంటున్నట్లు కనిపిస్తుంది.

**Attention + Interaction + Publicity = Profits**

ప్రభుత్వమే నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో కూడా విద్యార్థుల బాగోగులను పట్టించుకునే ప్రయత్నాలు జరుగుతుండటంతో ప్రజలు అటువైపు కొంత మొగ్గు చూపుతున్నారు. ఏవో కొన్ని తప్ప దీనికి భిన్నంగా అత్యధికంగా ప్రభుత్వ, లోకల్ బాడీ స్కూల్స్ పనిచేస్తున్నాయి. మొత్తం మీద పరిశీలించినప్పుడు ఉపాధ్యాయుల దృష్టి మొత్తం తమ బిడ్డల పైనే ఉండాలని తల్లి దండ్రులు కోరుకుంటున్నారు. మరే ఇతర వ్యాపకాల్లో తల దూర్చరాదని ఆశిస్తున్నారు. ఇది న్యాయం కూడా.

**మన పాఠశాలలకు వచ్చే విద్యార్థుల తల్లి తండ్రుల పరిస్థితి :**

పొద్దున పనికిపోతే సాయంకాలం వరకు ఇళ్ళకు చేరరు. కొన్ని సీజన్లలో బాగా రాత్రి అయ్యాకే పనులు చాలించి ఇంటి ముఖం పడుతుంటారు. ఇప్పటికీ నామమాత్రపు చదువుకున్నవారు, చదువు రాని తల్లిదండ్రులే

ఎక్కువగా ఉన్నారు. దైనందిన జీవనం గడపడానికి పనులు వెదుకులాటలోనే వారి సమయం గడిచిపోతుంది. తమ పిల్లల చదువులు ఎలా ఉన్నాయి, వారు ఏం చేస్తున్నారనేది పట్టించుకొనే తీరిక, ఓపిక, అవకాశం ఉండటం లేదు. ఈ పరిస్థితులు విద్యార్థుల గైర్హాజరు పెరగడానికి దారితీస్తున్నాయి. బడిలో చదివింది, చదివించిందే చదువు. ఇళ్ల వద్ద తమను నియంత్రించే వారు అందుబాటులో లేక పోవడటంతో టీవీ, స్మార్ట్ ఫోన్లుకు అతుక్కుపోతున్నారు. స్నేహితులతో కబుర్లు, పనికిరాని ఇతర వ్యాపకాల్లో మునిగి తేలుతున్నారు.

ప్రస్తుత పరిస్థితులు ఎంత అననుకూలంగా ఉన్నా మనం చిత్తశుద్ధితో పని చేస్తే వాటిల్లో మార్పు తేగలం. ''**ప్రవాహ దిశలో కొట్టుకు పోయే వాళ్ళు ఎప్పటికీ గట్టు చేర లేరు. ప్రవాహానికి ఎదురీదిన వాళ్ళే గట్టుకు చేరతారు**''. మనం (ప్రభుత్వ ఉపాధ్యాయులం) ఇలాంటి ప్రతికూల పరిస్థితులను అవకాశాలుగా మార్చుకొని గెలుపుకు బాటలు వేసుకుందాం. మన పాఠశాలలలో విద్యార్థులను చేర్పించడం (Enrollment) రప్పించడం, వారిని నిలబెట్టుకోవడం (Retention) సాధ్యమే.

## 1.2. ప్రణాళిక - కార్యాచరణ:

ఇంతకూ మనమేం చేద్దాం?

**ముందుగా మన పాఠశాల గురించి తెలుసుకుందాం.**



ప్రతీ పాఠశాలకు చరిత్ర ఉంటుంది. దశాబ్దాల క్రితం దాతలు ఎంతో విలువైన తమ స్థలాలను ఇచ్చి పాఠశాలలు స్థాపించారు. బడితో తమ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపబడతాయనే ప్రజల విశ్వాసం, ఆకాంక్షల కనుగుణంగా నాడు ప్రభుత్వాలు, పాఠశాలలను స్థాపించాయి. నేపథ్యాన్ని మనం పూర్వ విద్యార్థులు, పెద్దలు, ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకోవడం అవసరం. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, త్యాగాలు తెలిస్తే మనం మరింత బాధ్యతాయుతంగా పని చేయగలం.

### పాఠశాల పరిధి :

ఎన్ని ఆవాస ప్రాంతాలున్నాయి. ప్రజలెంత మంది ఉన్నారు? ఎన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత అందునా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఎన్ని పని చేస్తున్నాయో తెలుసుకోవాలి. అన్నింటినీ సందర్శించాలి. మన పాఠశాలలో చేరే వయసున్న పిల్లల వివరాలు నమోదు చేసుకోవాలి (ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సర్వే చేస్తే అన్నిస్థాయిలకు ఆ సమాచారం ఉపయోగపడుతుంది. ఇప్పటికే అన్ని పాఠశాలలు అటువంటి రికార్డులు నిర్వహిస్తున్నాయి). ఉన్నత పాఠశాలల వారు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి ఈ సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించి Enrollment పై శ్రద్ధ పెట్టాలి. **100** శాతం మందిని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి అలాగే ప్రైవేట్ పాఠశాలల నుండి కొందరినైనా రప్పించేందుకు కృషి చేయాలి. ఆయా గ్రామాల పెద్దలు, ప్రభుత్వాధికారులు, స్వయం సహాయ బృందాలు, ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులతో సుహృద్భావపూరిత వాతావరణం ఉండేలా మనం ప్రయత్నించాలి. దానివల్ల మన పాఠశాలకు పిల్లలను పంపించమని తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంటుంది. వారి బిడ్డలను మన పాఠశాలలో పంపే అవకాశం ఉంటుంది. మన పరోక్షంలో మన గురించి సానుకూల చర్చలు జరుపుతారు. మనల్ని సొంతం చేసుకుంటారు.

## మన పాఠశాల : అనుకూలాంశాలు, ప్రతికూలాంశాలు

### అనుకూలాంశాలు (Advantages):

ప్రతి ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో స్థితిగతులను మార్పుచేయడానికి ఆయా పాఠశాల యొక్క అనుకూలాంశాలు, ప్రతికూలాంశాలు లేదా తాను ఎదుర్కొనే సవాళ్ళను గుర్తించి అధ్యయనం చేసి అందుకు తగు చర్యలను చేపట్టాలి.

1) మొత్తం ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులు భర్తీ చేయబడి ఉండటం.

2) అందరూ అంకితభావంతో పని చేయడం, వారి మధ్య ఐక్యత ఉండటం.

3) ఉపాధ్యాయ శిక్షణ–వారి ప్రత్యేకతలు? ఉపాధ్యాయుల మంచి పనితీరు

మన ఉపాధ్యాయుల గురించి మనకు పూర్తి అవగాహన ఉండాలి. వారి సామర్థ్యాలను గుర్తించి తగిన పని అప్పగించాలి. ఫలితాన్ని చెక్ చేసుకోవడం ముఖ్యం. ఉపాధ్యాయుల మధ్య పనివిభజన జరగాలి. కొందరిపై అలవిమీరిన పని మోపడం, మరి కొందరికి పనేమీ అప్పగించ కుండా ఉండటం సమంజసం కాదు దాని వలన పని పరిమితంగా జరుగుతుంది. పని ఎలాగైనా ఎగ్గొట్టాలి అనే మనస్థత్వం ఉన్న వారిని పనిలోకి దించకపోతే పనిచేస్తున్న వారికి ఆటంకాలు సృష్టిస్తారు. అందరిచేత పని తీసుకోవాలనే భావన, నేర్పు, నైపుణ్యాలను మనం సంతరించుకోవాలి.

4) నూతన పద్ధతుల్లో పని చేయాలనే లక్షణాలు కలిగి ఉండటం.

5) విద్యార్థుల హాజరు 80శాతం పైగా ఉండటం.

6) మౌలిక వసతులు తగినన్ని ఆకర్షణీయమైన భవనాలు, తరగతి గదులు ఉండటం. మంచి నీరు ఏర్పాటు. తగినన్ని టాయిలెట్స్ ఉండటం, నిర్వహణ సక్రమంగా ఉండటం వగైరా.

7) తల్లిదండ్రుల మద్దతు.

### ప్రతికూలాంశాలు (Disadvantages):

1) ఉపాధ్యాయ మరియు సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటం. ఉన్నతాధికారుల సహాయంతో అవసరమైన పోస్టులు మిగులు ఉన్న పాఠశాలల నుండి డిప్యుటేషన్ తీసుకోవడం.

2) **మౌలికవసతులు:** అవసరమైన వసతులను **AAPC** (అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ) సహాయంతో ఏర్పాటు చేసుకోవడం.

3) **విద్యార్థులు గైర్హాజరు :** విద్యార్థుల హాజరు **75** శాతం కంటే తక్కువగా ఉంటే చదువచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. పాఠశాల హాజరు **90** శాతం కంటే మించి ఉంటే తప్పకుండా చదువు వస్తుంది.

**విద్యార్థులు - గైర్హాజరు : కారణాలు - నివారణా చర్యలు**

విద్యార్థిని పాఠశాల ఆకర్షించే విధంగా లేకపోవడం -ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రవర్తించే తీరు క్రియాశీలకంగా ఉంటుంది. విద్యార్థితో వ్యక్తిగతంగా ప్రేమ పూర్వకంగా సంభాషించడం, సమస్య గుర్తించి పరిష్కారాన్ని కనుగొనడం, అవసరమైతే ప్రధానోపాధ్యాయులు లేదా సహోపాధ్యాయుల సహకారం తీసుకోవడం.

- **Peer Group** కలుపుగోలుతనం (విద్యార్థులు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం)
- విద్యార్థి ఆసక్తిని గుర్తించి గౌరవించడం, అభివృద్ధికి సహకరించడం వగైరా

**తల్లిదండ్రుల అశక్తత/అనాసక్తి :**

- తల్లిదండ్రులను వారికి వీలైన సమయంలో వారి ఇళ్ల వద్ద కలసి సమస్య గురించి ఓపికగా చర్చించడం. పరిష్కారాన్ని సూచించడం.
- పేదరికం / తోడ బుట్టిన పిల్లల సంరక్షణ (అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించడం) వృద్ధులకు సేవ చేయడం / తల్లి దండ్రుల పనుల్లో సహకరించడం/తల్లి దండ్రుల గొడవలు/బాల కార్మికునిగా పని చేయడం వగైరా లేదా పాఠశాల ఎగ్గొట్టి తిరగడం. చెడు అలవాట్లకు లోనవడం. సమస్య తీవ్రతను బట్టి సంబధిత క్లాస్ టీచర్/ ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవడం.

## విలువైన అనుభవం

విద్యార్థి ఉద్దేశ్యపూర్వకంగానే పాఠశాలకు రాకున్నప్పుడు ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం జడ్.పి. హెచ్.ఎస్ సింగరాయపాలెం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అనుభవం మనకు ఉపకరిస్తుంది. ఆదర్శప్రాయంగా ఉంది.

ఆవాస ప్రాంత గ్రామాలకు ఒక్కో లీడర్ ను నియమించారు. వారు తల్లిదండ్రులను కలసి వాళ్ళ

అమ్మాయి / అబ్బాయిల గైర్హాజరు విషయం చెప్పి ఒక షీట్ మీద వారి సంతకం తీసుకుంటారు. తల్లి దండ్రులకు సమాచారం తెల్పడం తో తగు చర్యలు తీసుకొని రెగ్యులర్ గా తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నారు. ఫలితంగా **300** కు పైగా విద్యార్థులు,**15** ఆవాస ప్రాంతాల నుండి వస్తున్నా ప్రతీ రోజూ తమ విద్యార్థుల హాజరు **90** శాతం తో నిలకడగా ఉంటున్నట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీ లక్ష్మి నారాయణ గారు వివరించారు.

## అధికారుల మానిటరింగ్ :

స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చెప్పేది ఓపిగ్గా వినాలి. ఆ సమస్య పరిష్కారం కోసం ఏం చేసారు, ఫలితం ఎలా ఉంది? ఇకముందు ఏం చేయాలనే మార్గాలను అధికారులతో కలిగి అన్వేషించడం, అమలు చేయడంతో చాలా వరకు సమస్యలు పరిష్కరించబడతాయి.

## చదువులో వెనుకబాటుతనం (Slow learners)

విద్యార్థి ప్రత్యేక టాలెంట్ ను గుర్తించి, అభివృద్ధి పరచుకోవడానికి సహకరించడం. మనం అన్ని స్థాయిల్లో అనుకూలాంశాలను చక్కగా వినియోగించుకోవాలి. ప్రతికూలాంశాలను గణనీయంగా తగ్గించుకోవడం కోసం నిరంతరం ఆలోచించాలి, ప్రయత్నించాలి. మార్పు మనతోనే School Leader తోనే మొదలవ్వాలి. వినడం ముఖ్యం. ఓపికగా మన అవసరాలను వివరించటం, సహాయ సహకారాలను అర్థించడం జరగాలి. సమయము, సందర్భం, అవసరంను బట్టి విషయాన్ని హ్యాండిల్ చేయాలి.

## సహచరులతో వ్యవహరించడం :

పాఠశాల నాయకులలో 'అహం' అనే అంశం ఉత్పన్నం కారాదు. కొన్ని సందర్భాల్లో కొన్ని విషయాల్లో కొంత తగ్గినట్లు అనిపించినా/ కఠినంగా వ్యవహరించినా అది పాఠశాల ప్రయోజనాల కోసమేనని గుర్తించాలి. సమిష్టి పని విధానానికి పెద్ద పీట వేయాలి. మనకు ఏం కావాలో స్పష్టంగా ఉపాధ్యాయులకు వివరించాలి. అందరి అభిప్రాయాలు వినడం, అవసరమైతే మన ఆలోచనల కంటే బాగా ఉంటే వాటినే స్వీకరించి అమలుచేయాలి.

పొరపాటు అభిప్రాయాలు కలిగిన వారికి ఓపిగ్గా వివరించి సరి చేయాలి. మనతో కలిసి వచ్చే వారి సంఖ్య నిరంతరం పెంచుకోవాలి.

"మన ఆశయం ఎంత గొప్పది అయినా కార్యాచరణలో అత్యధికులను కదిలించి నప్పుడు మాత్రమే అది వాస్తవ రూపం దాల్చుతుందని మనం గుర్తించాలి".

## 3.0 మన పాఠశాలలో చదువు (Study) :

మన పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడం (పరిమాణాత్మక మార్పు)తోపాటు వారికి నాణ్యమైన విద్య నందించడం (గుణాత్మక మార్పు), పాఠశాల నాయుకుడికి అత్యంత ముఖ్యమైన బాధ్యత.

### లక్ష్యం (Target)

మనం పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ప్రతీ యేట పెరుగుతుందా. తగ్గుతుందా! కారణాలు.

- ప్రభుత్వ రంగంలో వివిధ యాజమాన్యాలలో ఏర్పడిన పాఠశాలలు మన పాఠశాలలో విద్యార్థులు తగ్గడానికి ప్రధాన కారణం కావచ్చు కూడా.
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కారణమా (సంఖ్య పెరిగినా తగ్గినా) - సంఖ్య నిలకడగా ఉండటం (అదే ఒక్కోసారి సానుకూలాంశం కావచ్చు. అవుతుంది కూడా. కొండ ఎక్కేటప్పుడు సడన్ గా మోటర్ సైకిల్/కార్ ఆగిపోతుంది. దాన్ని కిందకి జారిపోనీయకుండా ఆపడం కూడా ప్రగతే.

### సమిష్టి ప్రణాళిక రూపొందించుకోవడం

**School Head (Principal / Head Master)** పాఠశాల అధిపతిగా ఉన్నప్పటికి పాఠశాల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య బద్దంగా పని చేయవలసి ఉన్నది. తాను ఏదైనా కార్యక్రమం చేయతలపెడితే దానికి సంబంధించిన అవగాహన ఉన్న వారితో ముందుగా సంప్రదించాలి. వారి సహకారంతో రూపొందించిన ప్రణాళికను స్టాఫ్ మొత్తానికి వివరించి అవసరమైన మార్పులు-చేర్పులు చేసుకొని "నిర్ధిష్ట ప్రణాళిక" కు రూపం ఇవ్వాలి. సమిష్టి భాగస్వామ్యంతో తయారైన ప్రణాళిక అమలులో అందరి సహకారం ఉంటుంది.

### పాఠశాలకు, తల్లిదండ్రులకు మధ్య వారధిగా ఉపాధ్యాయులు:

‘‘పాఠశాల భౌతికంగా పిల్లల కళ్ళకెదురుగానే ఉంటుంది. కానీ సామాజికంగా అది కొన్ని వేల యోజనాల దూరంలో ఉంటుంది’’ అని ఒక సంఘ సంస్కర్త చెప్పారు. ఆ అంతరం తగ్గించాల్సింది ప్రభుత్వము, ఉపాధ్యాయులే.

మన పాఠశాలల గురించి, మన పట్ల (ఉపాధ్యాయులు) ప్రజలకు ఎటువంటి అభిప్రాయలు ఉన్నా మన అంకితభావం, చిత్తశుద్ధిని నిరూపించుకోవడం కోసం అవకాశాలు సృష్టించుకొని పదేపదే మనం విద్యార్థులను, వారి తల్లిదండ్రులు, గ్రామం/పట్టణంలో ప్రజలను ప్రభావితం చేయగలవారిని కలుస్తూనే ఉండాలి. మనము నిబద్ధతతో చేసే ప్రతీ పని వారికి నచ్చుతుంది. వారి అనుమానాలు నివృత్తి అయ్యేందుకు ఎంత ఓపిగ్గానైనా సమాధానం ఇవ్వాలి. వారి మనస్సులలో మనపట్ల సానుకూలతను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పాఠశాలపై గౌరవం, ఆదరణ పెరగడానికి దోహదపడుతుంది.

## ప్రతికూలతను సానుకూలముగా మలచుకోవడం:

వేసవి ఎండలు ప్రతికూలాంశం. తల్లిదండ్రులను ఇళ్ళ వద్ద కలవడానికి మనకు గల అవకాశం సానుకూలాంశం. వేసవి సెలవులు ప్రారంభమైన రోజు నుండి మనకున్న Habitations, విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికగా ఎన్ని రోజులు అవసరం అయితే అన్ని రోజులు ఉదయం 7 గంటల నుండి 11 లేదా 12 గంటల వరకు ఇంటింటికీ తిరగాలి, సర్వే చేయాలి (ఆ వివరాలు కింద ఇవ్వబడినాయి). విద్యార్థులను మన పాఠశాలలో చేర్పించమని విజ్ఞప్తి చేయాలి. ఇప్పటికే వారి పిల్లలు మన విద్యార్థులు అయితే కొనసాగించమని చెప్పవలసి ఉంటుంది. చదువుకు గ్యారంటీ ఇవ్వడం, మన పాఠశాల ప్రత్యేకతలతో తయారుచేసిన కరపత్రం ఇచ్చి నచ్చజెప్పాలి. ప్రైవేటుకు మనకూ ఉన్న తేడాను వివరించాలి. ఉదా: అన్ని సౌకర్యాలు **textbooks**, నోట్ బుక్స్ ఉచితంగా ఇవ్వడం, ఫీజులు లేకపోవడం, రుచికరమైన భోజనం, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ఇతర మౌలిక వసతులు, కంప్యూటర్ విద్య (ఉంటే), స్కాలర్షిప్స్, NMMS మొదలైన వాటి గురించి చెప్పాలి.

‘‘అన్నీ ఉచితంగా ఇచ్చేది ప్రభుత్వ బడి. అన్నింటికీ డబ్బు వసూలు చేసేది ప్రైవేట్ బడి’’ అని చెప్పవలసి ఉంటుంది. మన పనితీరు పై విమర్శలు కూడా వస్తాయి. మన పనితీరు మెరుగుపరుచుకోవడానికి చేపట్టే చర్యతో ఆ విమర్శలకు సమాధానాలు సందర్భానుసారం నిజాయితీతో వినయంగా సమాధానం చెప్పడంతో వారు మనల్ని

అంగీకరిస్తారు. దీనితోపాటు మనకున్న క్షేత్ర అనుభవాల దృష్ట్యా మనకు అననుకూల పరిస్థితులను మనకు అనుగుణంగా మార్చుకోవాలి. వ్యవహారం చెడగొట్టుకొనేలా ఉండరాదు. సమాన స్థాయిలో తల్లి తండ్రులను కూర్చో బెట్టుకొని చర్చించాలి. వారు చెప్పేది వినాలి. ప్రభుత్వ పాఠశాల అంటే ఉన్న చులకన భావాన్ని పోగొట్టి దానికొక గౌరవాన్ని తెచ్చి పెట్టే బాధ్యత తప్పకుండా అందులో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే''. సెలవులు అందునా మండు వేసవిలో (ఉంటే మహిళా ఉపాధ్యాయులు తప్పకుండా ఈ క్యాంపెయిన్ లో పాల్గొనడం అవసరం) తమను వెదుక్కుంటూ మనం రావడం వారికి నచ్చుతుంది. మనం చెప్పేది వింటారు. అలాగే జూన్ మొదటి వారంలో కూడా వారిని కలసి అడ్మిషన్లు ఖరారు చేసుకోవాలి. హైస్కూలు ఉపాధ్యాయులు **10** వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం కోసం సంక్రాంతి సెలవులు, నవంబర్ ఆఖర్లో (చలి కాలం, రాత్రిళ్ళు వెళ్ళడం వలన ప్రజల్లో సానుభూతి లభిస్తుంది. అది అభిమానంగా మారుతుంది) పాఠశాల సమయము ముగిశాక ఇళ్లకు వెళ్లి వారి బిడ్డ హాజరు, చదువు, క్రమ శిక్షణ గురించి వివరించాలి. ఉన్నది ఉన్నట్లు చెప్పే పని పేరిట అతిగా వ్యవహరించడం తగదు. అలాగే మంచి రిజల్ట్, మార్కులు సాధించడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు చెప్పడం అవసరం. అలాగే ప్రతీ రోజూ క్లాస్ టీచర్ పాఠశాలకు రాని విద్యార్థులు తల్లి దండ్రులకు తమ విరామ సమయంలో ఫోన్ చేస్తుండాలి. ''డబ్బే కాదు, ప్రజల మనస్సుల్లో మన పట్ల ప్రేమాభిమానాలను కూడా డిపాజిట్ చేసుకోవాలి. ఇది ఆచరణ సాధ్యమయ్యింది.''

## డాక్యుమెంట్ రాయడం:

ప్రతీ కార్యక్రమం పూర్తి అయిన వెంటనే దాని నిర్వహణ, లక్ష్యం ఎంత వరకు సాధించాం. ఎవరెవరు పాల్గొన్నారు**?** అనుభవాలేమిటి**?** విజయాలకు కారణాలు, గుర్తించిన లోపాలు, ఇక ముందు ఎలా సరిచేసుకోవాలి**?** ఉన్నతాధికారుల స్పందన - సూచనలు రికార్డు చేయడం భవిష్యత్ లో అవసరం అవుతుంది. దానిని జాగ్రత్తగా దాయాలి.

## మా అనుభవాలు

మహబూబాబాద్ జిల్లా **ZPHS** డోర్నకల్ హెడ్‌మాస్టర్ అయిన నేను, మా **20** మంది ఉపాధ్యాయులు అందులో **11** మంది మహిళలు పై విధంగా **15** గ్రామాలు **200** ఇళ్లకు పైగా తిరిగాము. వారు మాపట్ల ఎంతో

అభిమానం చూపుతున్నారు. పిల్లలను బాగా పట్టించు కుంటామని నమ్ముతారు. చదువు చెప్పడం కూడా అలాగే ఉంటుంది. మా ప్రయత్నాలు గురించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో వార్తలు, కథనాలు ఇచ్చి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతంగా కవరేజ్ చేసింది. సమాజంలో పెద్ద ప్రభావం వచ్చింది. మా టీమ్ ఆత్మ విశ్వాసం పెరిగింది. అలాగే తల్లిదండ్రుల దీనస్థితి చూశాక మరింత బాధ్యతాయుతంగా పని చేయడం అలవడుతుంది.

మా సందర్శన తరువాత ఏర్పాటుచేసిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్‌కు **100**కు పైగా తల్లి దండ్రులు రావడం అందునా **80** మందికి పైగా తల్లులు రావడంతో ఆ సమావేశంలో పాల్గొన్న **DEO**, డా **A.** రవీందర్ రెడ్డి గారు చాలా అభినందించారు. ఆ సమావేశంలో తల్లి దండ్రులు, ప్రజా ప్రతినిధులు మా కృషి గురించి కొనియాడారు. పాఠశాల పిల్లలు, వారి తల్లిదండ్రుల సామాజిక ` ఆర్థిక పరిస్థితులు వారు చేసే వృత్తి, వారి జీవన విధానం గురించి తెలుసుకోవడానికి, అలాగే వారి పిల్లల అభ్యసన స్థాయిలను తల్లిదండ్రులకు తెలియజేయడానికి మా పాఠశాల ఉపాధ్యాయులు ఒక సర్వే నిర్వహించడం జరిగింది.

**PROFORMA**

**Students Socio, Economic, Educational Survey in Catchment Area:**

**School Name:**

**Mandal :**

**District :**

**Village / Town Ward:**

**S. No.**

**Name of the Student:**

**Parent Name:**

**Class / Section:**

**Community:**

**Financial Status:**

**Learning Standard:**

**Having No Parents Single Parents / Both**

పై విధంగా **Proforma** తయారు చేసుకోవడం.

2 **భాగాలుగా వర్గీకరణ:** మన పాఠశాల విద్యార్థులు, ఇతర పాఠశాల విద్యార్థులు వేర్వేరుగా సర్వే సమాచారాన్ని క్రోడీకరించి, విశ్లేషించడం. తదనుగుణంగా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయగలరు.

## సర్వే వలన ఫలితం యేమిటి?

- విద్యార్థులు, వారి కుటుంబ సభ్యుల మొగ్గు ఎటువెప్పు ఉంది. ప్రభుత్వం నుండి ప్రైవేట్ పాఠశాలల వైపా, ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల వైపా అనేది తెలుస్తుంది.
- సామాజిక తరగతులు (ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ) పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారా, ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నారా అనేది తెలుస్తుంది.
- పేద, మధ్య తరగతి పిల్లలు ఏ పాఠశాలల్లో ఉన్నారు. "మన పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు విద్యార్థులకు చదువు వస్తుంది. సంఖ్య బాగుంది అంటే చదువు బాగా చెబుతున్నారని ప్రజల మనసుల్లో మంచి ముద్ర పడుతుంది".

## విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు తెలుసుకోవడానికి

**1** లేదా **6** వ తరగతుల్లో మనం విద్యార్థిని చేర్చుకున్నప్పుడు **BASE LINE TEST** పెట్టడం. మన స్కూల్ లోనే ఉంటే గత సంవత్సరం వార్షిక పరీక్షలలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థి విద్యాస్థాయి (**Below Basic, Basic Average, Above Basic Performers**) నిర్ణయిస్తాము. దాని ప్రాతిపదికగా విద్యా బోధన జరగాలి.

ప్రతీ విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలు, ఆయా తరగతి సామర్థ్యాలు సాధించేటట్లు విద్యార్థులకు అవసరమైన విద్యాపరంగా తోడ్పాటును ఇవ్వాలి.

## పని దినాలు - పని గంటలు : టైం టేబుల్ (ప్లానింగ్)

మన పాఠశాలలో చదువు, ఆటలు, ఉపన్యాసం/వ్యాస రచన/చిత్ర లేఖనం/క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఇతర సేవా కార్యక్రమాలు జాతీయ ప్రాధాన్యత కలిగిన దినాల్లో నిర్వహించడం బహుమతులు ఇవ్వడం పరిపాటిగా మారాలి. ఏరోజుకారోజు ప్రత్యేకంగా ఉండేలా పాఠశాల కృత్యాలుండే విధంగా చూసుకోవాలి. దాని వల్ల చదువులో వెనుకబడిన విద్యార్థుల సైతం ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ వారికి సముచిత గుర్తింపు వస్తుంది. దాంతో వారు పాఠశాలకు సక్రమంగా హాజరవుతారు.

వ్యక్తిగత కేంద్రీకరణ - శ్రద్ధ తీసుకోవాలి. మనం ఏదన్నా సాధించాము అంటే అందులో కనిపిస్తుంది.

## అభ్యసన - సంక్షోభం

ప్రతీ పాఠశాలలో అతి పెద్ద సమస్య **Slow Learners**. (చదువులో వెనుకబడిన విద్యార్థులు) ఇదొక సామాజిక సమస్యగా మనం గుర్తించాలి. తీవ్రమైన అంశంగా పరిగణించాలి.

"విద్యార్థి/మనం తప్పు గుర్తించాలంటే ఒప్పు ఏదో తెలియాలి. తెలిస్తే తప్పును సరి చేసుకుంటారు. చేసుకుంటాం. అలా కాకుండా త(మ)నకు తెలిసిందల్లా సరిఅయినదని నమ్మితే భవిష్యత్తు అంతా తప్పులతోనే నిండిపోతుంది. అప్పుడు మనం ఒక ప్రమాదకర సమాజంలో బ్రతకాల్సి వస్తుంది". అందుకని ఉపాధ్యాయులు సంఘ సంస్కర్తలుగానూ రూపాంతరం చెందాలి.

ప్రథమ్ సంస్థ రూపొందించిన **ASER (Annual Status of Education Report) 2025**లు దేశవ్యాప్తంగా విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 5వ తరగతి విద్యార్థి కూడా **2** లేదా **3**వ తరగతి స్థాయిలో గణితం, మాతృభాషలో చదవడం, గణించడంలో వెనుకబడిపోతున్నారని వివరించారు. దీనిని అధిగమించకుండా ఉపాధ్యాయులు ముందుకు సాగలేరు. అలా ముందుకే వెళ్తాం అనుకుంటే వారు విద్యా ప్రమాణాలు లేని ఫలితాలనే చూడాల్సి వస్తుంది. అందుకని సమస్య తీవ్రతను గుర్తించి పరిష్కారాన్ని కనుగొనడం, దాన్ని సాధించడం అనివార్యమయ్యింది.

వివిధ సర్వే రిపోర్ట్ల ఆధారంగా మనం ఇప్పటికే తరగతుల వారీగా విద్యార్థులను **Below Basic (C), Basic Average (B), Above Basic Performers (A)** గా లిస్టులు తయారు చేసుకున్నాం.

## బోధన :



సామర్థ్యాల ఆధారంగా బోధన

తరగతి వారీగా సాధారణ బోధన స్థానంలో సామర్థ్యాలు ఆధారంగా బోధన జరపడం, అంటే తెలుగు చదవడం, రాయడం రాని విద్యార్థులు మరియు గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడం రాని వారిని ఏ తరగతిలో చదువుతున్నా వారికి ఆ సామర్థ్యాలు వచ్చే విధంగా చదువు చెబుతాము.

చదువులో వెనుకబడిన విద్యార్థులను తోటి విద్యార్థుల విద్యాస్థాయికి తీసుకురావడం అభివృద్ధి పరచడం ప్రతీ పాఠశాల ప్రాథమిక కర్తవ్యం కావాలి.

## ప్రణాళిక అమలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇప్పుడు అమలవుతున్న **FLN (Foundational Literacy and Numeracy)** అమలులో కొన్ని లోపాలు ఉన్నా సానుకూల ఫలితాలు క్రమేణా వస్తున్నాయి.

ఉన్నత పాఠశాలల్లో **LIP (Learning Improvement Programme)** అమలు నామ మాత్రంగా ఉంది. ఆయా పీరియడ్లలో సబ్జెక్టు బోధనలో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు **(C Grade)** చదువు చెప్పడం, రెమిడియల్ టీచింగ్, ట్యూటరింగ్ చేయడం ప్రాక్టీసు చేయించడం వంటి చర్యలు చేపట్టాలి.

ఏ తరగతికి ఆ సామర్థ్యాలు వచ్చే విధంగా ప్రతి తరగతిలో **1**వ తరగతి నుండే విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను మనం మెరుగుపరిస్తే భవిష్యత్తులో ఈ సమస్య ఉత్పన్నం కాదు.

**10** వ తరగతి విద్యార్థుల **Learning Poverty** ని అధిగమించడం కోసం ఏ తరగతికి అభ్యసన సామర్థ్యాలు రావడంపై దృష్టి పెట్టకుండా కేవలం విద్యార్థులు **10**వ తరగతికి వచ్చినప్పుడు మాత్రమే బోర్డు పరీక్షల దృష్ట్యా పరీక్షలు పాస్‌కావడమే లక్ష్యంగా చదువు చెప్పడం జరుగుతుంది.

విద్యార్థి ఇన్ని సంవత్సరాల నుండి తాను నేర్చుకోవలసిన సామర్థ్యాలను కూడబెట్టుకుని ఒకేసారి పదవ తరగతిలో ప్రత్యేక తరగతులని, ప్రాక్టీస్ క్లాసస్ అని, అధికమైన వత్తిడి గురి అవుతున్నారు. ఇలాంటి విద్యార్థులకు భావనల అవగాహనకు ప్రాధాన్యత ఇచ్చే బోధన జరిగితే ఫలితాలు సానుకూలంగా ఉంటాయి, తప్ప కేవలం ప్రాక్టీస్ పేర ప్రత్యేక తరగతులు నిర్వహణ వల్ల ఫలితాలు వస్తాయనుకుంటే అది మనం చేసే పెద్ద పొరపాటు. అందుకు ప్రణాళిక రూపకల్పన జరగాలి.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చర్యలు :



1) **6** నుండి **9**వ తరగతి విద్యార్థులకు **7,8** పీరియడ్ లలో ఒక పీరియడ్ తెలుగు, మరొక పీరియడ్ గణితం లను **1**వ తరగతి స్టాండర్డ్‌తో ప్రారంభించి

క్రమేణా సామర్థ్యాలు పెంచుతూ బోధించాలి.

2) చదువు రాని విద్యార్థులను డల్లర్స్, మొద్దు వంటి పదాలతో పిలవరాదు. వారు ఆత్మన్యూనతకు లోనవుతారు. అలా పిలవటం అంటే వారు నేర్చుకోవాలనే ఆసక్తిని చంపివేయడమే. అంతే కాదు చదువులో వెనుకబడి ఉండవచ్చు. ఇంకా అనేక అంశాలలో వారు అగ్ర భాగాన ఉండే అవకాశం ఉంది. విద్యార్థుల నేపథ్యం, అలవాట్లు, అభిరుచులను గమనించి ప్రోత్సహించాలి.

3) ఆయా తరగతుల విద్యార్థుల విద్యా స్థాయిలను బట్టి మనం **A, B, C** కేటగిరీలుగా విభజించాలి. (ఎలా చేయాలో ఇంతకు ముందే వివరించటం జరిగింది).

**B, C** స్థాయిలు కలిగిన వారిని **Little Teachers** గా పిలుస్తూ గ్రూపు లీడర్లు గా నియమించాలి. (విడిగా ఉంచడం కంటే కలిపే ఉంచడం మంచిది) టీచర్ సామర్థ్యాలు ప్రకారం బోధించడం జరిగాక వీళ్ళు (**Little Masters**) ప్రాక్టీసు చేయించాలి. **C** గ్రూపు పిల్లలు **B, C** గ్రూపు పిల్లలు దాదాపు ఒకే వయస్సు (**Peer Group**) కనుక నేర్పిస్తారు. ఆ పిల్లలు కూడా బిడియం లేకుండా నేర్చుకుంటారు.

4) సాయంకాలం జరిగే ప్రత్యేక తరగతులకు **C** గ్రేడ్ పిల్లలను హాజరయ్యే విధంగా చూసే బాధ్యతను కూడా **Little Master** కు అప్పగించాలి.

5) అన్ని స్థాయిల విద్యార్థుల తల్లితండ్రులకు ముందుగానే ఈ ప్రణాళిక గురించి వివరించి సహకరించమని విజ్ఞప్తి చేయాలి. **Practice** చేయటం ఇరు పక్షాలకు ఉపయోగకరం అని గుర్తించే విధంగా తెలియజేయాలి.

6) ఈ క్లాసులో **30** మందికి మించకుండా విద్యార్థులు ఉండాలి.

7) **బోధనా బాధ్యత:** తెలుగు ఉపాధ్యాయులు వారికి తోడుగా తెలుగు మెథడాలజీలో శిక్షణ పొందిన బయోసైన్స్ లేదా సోషల్ టీచర్ల సహకారం అలాగే గణితం ఉపాధ్యాయులు అదే మెథడాలజీలో శిక్షణ పొందిన ఫిజికల్ సైన్స్ టీచర్ల సహకారం తీసుకోవాలి.

8) సిలబస్ (సామర్థ్యాల వారీగా) ప్లాన్ చేసుకోవడం.

9) ఉచితంగా నోట్ బుక్స్ ఇవ్వడం.

10) అవసరం, అవకాశంను బట్టి ఇతర రూపాలలో ప్రోత్సాహకాలను అందించడం.

11) **అభినందనలు/ప్రమోషన్: C Grade** నుండి **B, A** గ్రేడ్ సాధిస్తే వారిని అభినందించాలి. వారిని **C** గ్రేడ్ పిల్లలకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించుకోవాలి. తమను తాము నిరూపించుకోవాలనే ఉత్సాహం వారిలో ఉంటుంది.

12) **Co-Curricular, Extra Curricular Activities** లో చురుగ్గా పాల్గొనే వారిని ప్రోత్సహించాలి. స్కూలు కోసం వారు చేసిన ప్రతీ పనికి, ప్రతీ సందర్భంలో **Thanks** చెప్పడం ద్వారా ఇంకా పని చేయాలనే కోరిక పెరుగుతుంది.

13) ఆర్థిక సమస్యలు ఉన్న పిల్లలను ఆదుకోవడం.

14) **Learning Improvement** ఎంతవరకు నేర్చుకున్నారనేది తెలుసుకోవడం కోసం పరీక్షించడం, కార్యాచరణను నిరంతరం కొనసాగించడం.

**Teach ® Assessment ® Re Teach ® Re Assessment**

15) ఈ పనిచేయడం ఉపాధ్యాయుల ప్రాథమిక కర్తవ్యంగా గుర్తించాలి. ఓపిగ్గా, పట్టుదలగా పిల్లలంతా నేర్చుకునేంత వరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగించాలి.

16) నిపుణుల సలహా సూచనలు తీసుకోవడం: **Experts** అంటే **Learning Improvement** సాధించిన **School Leader / Teachers / Little Masters** అని గుర్తించాలి. వారి సూచనలు, సలహాలు తీసుకోవడం జరిగితే కొంత కాలానికి **Slow Learners** కు బోధించిన ఉపాధ్యాయులే నిపుణులు అవుతారు.

**అనుభవాలు :**

తొలుత **2022-23** సంవత్సరంలో ఖమ్మంజిల్లా, పెనుబల్లి మండలంలోని **450** మంది విద్యార్థులు గల **ZPHS V.M.** బంజరులో నేను **FAC** హెడ్మాస్టర్‌గా చేసినప్పుడు **151** మంది **Slow Learners** కు **3**నెలల పాటు ఇలా చదువు చెప్పిన ఫలితంగా తెలుగులో **60**శాతం, గణితంలో **40**శాతం అభివృద్ధి సాధించాం. మొత్తం ఉపాధ్యాయులు పరస్పరం సహకరించుకుంటూ ఈ ప్రణాళికను రూపొందించి అమలు చేశాము.

మా అనుభవాలను **SCERT** అడిగి తెలుసుకుంది. తరవాత కాలంలో **LIP** రావడం జరిగింది. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలోని **ZPHS** డోర్నకల్‌లో నేను గెజిటెడ్ హెడ్మాస్టర్ గా పని చేస్తున్నాను. **2024** నవంబర్ **4** నుండి ఈ ప్రణాళికను అమలు చేస్తున్నాము. ఇది **2025** ఫిబ్రవరి ఆఖరు వరకూ కొనసాగుతుంది. తదుపరి విద్యా సంవత్సరంలో జూలై నెల మొదటి నుండే అమలు చేస్తాము. మేము ఆశావహ దృక్పథంతో పని చేస్తున్నాము. తల్లిదండ్రులు, విధ్యాధికారులు మా ప్రయత్నాలను స్వాగతిస్తున్నారు.

## ఫలితాలు:

1) విద్యార్థులు గైర్హాజరు తగ్గుతూ హాజరు మెరుగవుతుంది. చదువు మీద ఆసక్తి క్రమేణా పెరుగుతుంది.

2) అల్లరి, క్రమశిక్షణారాహిత్యం నుండి చదువుపై దృష్టి పెట్టడం. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఆత్మీయ సంబంధాలు నెలకొల్పబడుతున్నాయి.

## మరి కొన్ని సూచనలు :

1) **గడువు : Basics** రావడానికి సమయము **3,4** నెలలకు పరిమితం చేయడం వలన ఉపాధ్యాయుల్లో **Target** సాధించాలనే పట్టుదల ఉంటుంది. కాని సాధారణ బోధన గావించినప్పుడు విద్యార్థులు ఏ ఏ అంశాలలో వెనుకబడుతున్నారో, ఆయా అంశాలలో వారికి నేర్చుకోవడానికి తోడ్పాటు వెనువెంటనే జరగాలి. ఇవి నిరంతరంగా జరిగే ప్రక్రియ, ఇది బోధనలో భాగం కావాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థి ఏ తరగతిలో ఉంటాడో ఆ తరగతిలో సామర్థ్యాలు పొందుతారు.



పాఠశాల ప్రణాళిక గురించి గౌరవ కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ గారితో చర్చిస్తున్న హెడ్మాస్టర్

విద్యార్థుల ప్రగతి గురించి **PTM** లలో వివరించడం. సమావేశాలకు రాని వారి ఇళ్ళకు వెళ్ళి వివరించడంతో వారు మన పట్ల కృతజ్ఞతతో సుహృద్భావ సంబంధాలు ఏర్పరచుకుంటారు. గుణాత్మక విద్య సాధించడం అంటే అత్యధికులకు బాగా చదువు రావడం, దానిని నిత్యజీవితంలో వినియోగించుకోవడం అని అర్థం. ప్రజల్లో మన పాఠశాల పట్ల, మన పట్ల స

# 2. సంక్షేమం

సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఉన్నంత కాలం ప్రభుత్వాలు, పాఠశాలలు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అవి తీసుకొనే చర్యలు భవిష్యత్తులో సమాజానికి వీటి అవసరం లేని విధంగా ఉండాలి. ఇంకో మాటలో చెప్పాలంటే అంతరాలను, అసమానతలను అధిగమించి స్వావలంబన సాధించాలి. ఇది అసాధ్యమనిపించవచ్చు. ప్రయత్నపూర్వకంగా దీనిని సాధించాలి. సుదీర్ఘ సంక్షేమ చర్యలు కొనసాగటం వాటి అవసరం అలాగే ఉంటే అమలు చేయబడుతున్న ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న విధానాలలో లోపం, అమలులో వైఫల్యం ఉందని గుర్తించాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువు బాగా వస్తుంది. అది సంక్షేమ నిలయంగా ఉందని ప్రజలు గుర్తించాలి. ప్రైవేట్ పాఠశాలలు అన్నీ తల్లి దండ్రులు నుండి తీసుకొంటుంది. ప్రభుత్వ పాఠశాలలు అన్నీ ఇస్తూ చదువు చెబుతాయని నమ్మకం కలిగించాలి. తల్లితండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గించాలి. "తమ బిడ్డల చదువే కాదు వారి సంక్షేమం కోసం కూడా పాఠశాల బాధ్యత తీసుకుంటుంది" అని గుర్తించే విధంగా మన పాఠశాలలు ఎదగాలి.

## 2.1 మనం ఏం చేయాలి?

**1)** ప్రభుత్వం నేరుగా ఇస్తున్న దేమిటి**?**

జాతీయ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ప్రాక్టీసు బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం (కులాలకతీతంగా అందరికీ) స్కాలర్షిప్స్ (సామాజిక తరగతుల విద్యార్థులకు), **NMMS.**

పైవి ఆర్థికంగా కొద్ది మొత్తం అయినా అవి సంబంధితులకు వచ్చేలా ప్రయత్నిస్తే తల్లిదండ్రులు పాఠశాలల పట్ల కృతజ్ఞత చూపుతారు. సమాజం కూడా దృష్టి సారిస్తుంది.

## 2.2 మన స్వతంత్ర కృషి :

**మహబూబాబాద్ జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డోర్నకల్ అనుభవాలు :**

మా పాఠశాలలో **282** మంది విద్యార్థులు చదువుచున్నారు. **98%** మంది వెనుకబడిన సామాజిక తరగతులకు చెందినవారు వారిలో **5** గురికి తల్లిదండ్రులు లేరు. **46** మంది విద్యార్థులు తల్లి లేదా తండ్రిని మాత్రమే కలిగిఉన్నారు. వారికి ఆత్మస్థైర్యాన్ని, భరోసాను అందించాల్సిన బాధ్యత పాఠశాలపై ఉన్నది. అలాగే విద్యార్థుల సురక్షితం, ఆరోగ్యం వారి బధ్రత కూడా పాఠశాలకు చాలాముఖ్యం. అందుకోసం మా పాఠశాల చేపట్టిన కొనిన చర్యలు మీముందుంచుతున్నాను.

### 1) RO Water Plant ఏర్పాటు :

గతంలో మా పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేసిన మరియా మాణిక్యం గారు అందజేసిన విరాళం **1.60** లక్షలతో **RO Water Plant** నిర్మించాము. దానిని ఆనాటి కలెక్టర్ కె. శశాంక్ **IAS** గారు ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సురక్షిత మంచి నీరు తాగుతున్నారు.



**RO Water Plant** ను ప్రారంభించిన
ఆనాటి కలెక్టర్ కె. శశాంక్ **IAS** గారు

### 2) Students Welfare Trust:

**Students Welfare Trust** ను **2024** జనవరిలో ఏర్పాటు చేశాం. ట్రస్టు చైర్మన్, కార్యదర్శిగా సీనియర్ టీచర్స్, మరో ఇరువురు మహిళా ఉపాధ్యాయులతో కమిటీ పాఠశాలలోని మొత్తం ఉపాధ్యాయుల ఆమోదంతో నియమించబడి పని చేస్తున్నది. ఉపాధ్యాయులు, సిబ్బంది తమ పుట్టిన రోజుల సందర్భంగా ట్రస్టుకు వేలాది రూపాయలు విరాళంగా అందజేశారు. ఒక్క సంవత్సర కాలంలోనే లక్ష రూపాయలు విరాళంగా వచ్చాయి. వాటితో పేద విద్యార్థులకు ఆటో ఖర్చులు ఇవ్వడం, పొద్దున్నే పరగడుపున వచ్చిన విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పెట్టించడం, వైద్య ఖర్చులు భరించడం, చదువులో వెనుకబడిన విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్ ఇవ్వడం, యూనిఫామ్ కుట్టే పేద మహిళా దర్జీలకు ప్రభుత్వం చెల్లిస్తున్న సొమ్ముకు తోడుగా అదనంగా **10**వేల రూపాయిలు ఇవ్వడం, గేమ్స్, స్పోర్ట్స్ పోటీలలో గెలుపొంది ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చినప్పుడు వారికి కొంత ఆర్థిక సహాయం అంద చేయడం జరుగుతున్నది.

ఈ విషయం పత్రికల ద్వారా తెలుసుకున్న **Telangana State Child Rights Protection Commission** మమ్మల్ని అభినందించింది.

### 3) SBI సహకారం:

**2024** సంవత్సరంలో **SBI** హైదరాబాద్ వారు **5** లక్షల విలువైన **5** కంప్యూటర్లు, వైఫై సౌకర్యం, అన్ని క్లాస్ రూములలో కుర్చీ అందజేశారు.

### 4) అమేజాన్ స్వచ్ఛంధ సంస్థ :

కంప్యూటర్ విద్యను విద్యార్థులకు నేర్పు కోసం ఒక ఇన్స్ట్రక్టర్‌ను నియమించింది.



**RBI** వారిచే కంపూటర వితరణ

### 5) పూర్వ విద్యార్థుల చేయూత (1982 బ్యాచ్):

తల్లిదండ్రులు లేని మరియు సింగిల్ పేరెంట్ గల దూర ప్రాంతాల నుండి పాఠశాలకు వస్తున్న **10** మంది బాలికలకు మా పాఠశాల పూర్వ విద్యార్థుల మరియు ఇరువురు మహిళా ఉపాధ్యాయుల ఆర్థిక సహాయంతో సైకిళ్లు కొని పేరెంట్ టీచర్స్ మీటింగ్ నాడు **DEO** గారిచే పంపిణీ చేశాము.

ఇలా మా పాఠశాలలో చదువుతున్న ప్రతీ నిరుపేద విద్యార్థికి ఏదో రూపంలో సంక్షేమ ఫలాలు అందజేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాము.

మేము చేపడుతున్న విద్యాభివృద్ధి చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు విద్యార్థులు, మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా చేయగలిగాము. గౌరవ జిల్లా కలెక్టర్ మరియు **DEO** ల సంపూర్ణ మద్దతు పొందగలిగాము.

## మనం ఇంకా ఏం చేయవచ్చు :

మనము పని చేస్తున్న పాఠశాల నాయకుడిగా ఉన్న మనం నిత్యం సానుకూల దృక్పథంతో పని చేస్తూ ప్రజల నోళ్ళలో నానాలి.

**అందుకోసం**

**1)** దాతల సహకారంతో మధ్యాహ్న భోజనంకు అదనంగా పౌష్టికాహారాన్ని అందించేందుకు కృషి చేయడం

**2)** వ్యాయామం, యోగా, మార్షల్ ఆర్ట్స్ నేర్పించడం - తద్వారా విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వం అభివృద్ధి పరచడం

**3)** విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇప్పించుట

**4)** సమాజ సేవలో విద్యార్థులను భాగస్వాములను చేయుట ద్వారా సామాజిక బాధ్యతలను అలవరచుకుంటారు.

**5)** సాంస్కృతిక కార్యక్రమాలు: చిన్న పిల్లల నుండి పెద్దల వరకు వారి మనసులను అలరించేవి, ఆలోచింప జేసేవి, సానుకూల దృక్పథం ను పెంచే విధంగా కళారూపాలు నేర్పించి, ప్రదర్శింప జేయడం.

**6) చర్చలు:** పర్యావరణం, సామాజిక రుగ్మతలను రూపుమాపడం, ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాల వినియోగం, దొంగతనాలు వంటి అంశాలపై చర్చ జరగాలి.

## అంకిత భావం - సమన్వయం:

మిత్రులారా ←

మన ఆలోచనలు, కార్యాచరణ అంతిమంగా విద్యార్థుల మధ్య, ఉపాధ్యాయుల మధ్య గరిష్ఠ ఐక్యతను పాదుకొల్పాలి. ప్రాప్తకాలజ్ఞతతో పాటు ప్రణాళికాబద్ధంగా మన పని విధానం ఉండాలి.

సమాజంతో మన పాఠశాలను మమేకం చేయడానికి ఏమి చేయగలమని నిరంతరం ఆలోచించాలి. అవకాశాలను సృష్టించుకోవాలి. మన చొరవతో మన ఉపాధ్యాయబృందం మరింత సృజనాత్మకతను, అంకితభావాన్ని సంతరించుకుంటుంది మరింత సమన్వయంతో పనిచేస్తుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు మన పట్ల కృతజ్ఞతతో వ్యవహరిస్తారు. మన పాఠశాల ప్రతిష్ఠ పెరుగుతుంది. మన ప్రభుత్వబడి, పేదలబడిగా వారి పెన్నిధిగా విరాజిల్లుతుంది.

## మధింపు:

1. మీ పాఠశాల భవిష్యత్తుపై మీయొక్క దార్శనికతను తెలియజేయండి.
2. మీ పాఠశాల పాలనలో మీరు గుర్తించిన అనుకూల / ప్రతికూల అంశాలు ఏమిటి?
3. మీరు తెలియజేసిన అనుకూల / ప్రతికూల అంశాలను దృష్టిలో పెట్టుకుని, మీ పాఠశాల అభివృద్ధికి ఒక ప్రణాళికను రూపొందించండి.
4. ఇంత వరకు మీ పాఠశాల అభివృద్ధికై మీరు, మీ పాఠశాల సిబ్బంది నిర్వహించిన కార్యక్రమాలు వివరించగలరు.